క్లుప్తంగా

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన హనుమప్పతాత విగ్రహం, సీతా, రామ, లక్ష్మణుల విగ్రహాలు

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామ సమీపంలోని కూర్మనారాయణస్వామి క్షేత్రంలో శనివారం హనుమప్పతాత, సీతా, రామ, లక్ష్మణుల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో దస్తగిరిస్వామి ఉరుసు



జొన్నగిరిలో దస్తగిరిస్వామి ప్రతిమను గుర్రంపై ఊరేగిస్తున్న ముజావర్లు

తుగ్గలి : మండల పరిధిలోని జొన్నగిరిలో దస్తగిరిస్వామి ఉరుసు ఉత్సవాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున ముజావర్లు స్వామి ప్రతిమను గుర్రంపై ఉంచి మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. కులమతాలకతీతంగా గ్రామస్తులు స్వామికి చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

శబరిమలకు అయ్యప్ప మాలధారులు



అయ్యప్ప మాలాదారులకు ఇరుముడి కడుతున్న గురుస్వామి

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామం నుంచి శనివారం అయ్యప్ప మాలధారులు శబరిమలకు తరలి వెళ్లారు. మాలధారులు ఉదయమే స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారిని పూలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, మహామంగళహారతి, నైవేద్య సమర్పణ ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాలధారులకు గురుస్వామి మంజునాథస్వామి ఇరుముడి కట్టి అందించగా.. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు, గ్రామస్తులు స్వాములకు వీడ్కోలు పలికారు.

కురువలకు రాజకీయంగా ప్రాధాన్యతివ్వాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆ సంఘ నాయకులు

గోనెగండ్ల: కురువలకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చి, వచ్చే ఎన్నికల్లో రెండు ఎంపీ, 8 అసెంబ్లీ, 4 ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని కురువ యువజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈనెల 26న మదనపల్లిలో జరుగునున్న కురుబ, కురుమ సంఘ సమావేశ పోస్టర్లను శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో కురువ సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ సమావేశాలకు కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి కురువ సంఘ ముఖ్య నాయకులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకట్రాముడు, బీరప్ప, పిల్లిగుండ్ల జయరాముడు, నరసింహ, రంగన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు షూ పంపిణీ



క్రీడాకారులకు పుట్‌బాల్ షూ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పుట్‌బాల్ క్రీడాకారులకు శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రాహుల్ యారువా ఆధ్వర్యంలో రూ.7వేల విలువైన పుట్‌బాల్ షూలను నాగర్ కర్నూలు అడిషనల్ ఎస్పీ టీఏ.భరత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుట్‌బాల్ కోచ్ మాబు, స్థానిక సీనియర్ క్రీడాకారులు పాలశ్రీనివాసరెడ్డి, ప్రసాద్, హనీఫ్, సరజాత్ పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి



వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

- మంత్రి గుమ్మనూరు జయరాం
- నేమకల్లులో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- నూతన గ్రామ సచివాలయం ప్రారంభం

చిప్పగిరి: సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని నేమకల్లు గ్రామంలో గ్రామ సర్పంచి ప్రేమ్ కుమార్ అధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.39 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయాన్ని మంత్రి ప్రారంభించారు. అలాగే రూ. 10 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులు ఎవరైనా ఉంటే గుర్తించి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రతి వర్గానికి లబ్ధి

దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారని, నవరత్నాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి వర్గానికి లబ్ధి చేకూరిందని మంత్రి అన్నారు. కులాలకు మతాలకు ప్రాంతాలకు పార్టీలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందించిన పార్టీ దేశంలో ఏదైనా ఉంది అంటే అది వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా మాయమాటలు చెప్పడానికి ప్రతిపక్ష టీడీపీ ప్రయత్నాలు చేపట్టిందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న పార్టీలు అన్నీ ఏకమై వచ్చినా 2024లో జగనన్న మరలా ముఖ్యమంత్రి కావడం కాయమని అన్నారు .కార్యక్రమంలో అలూరు నియోజక వర్గ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణ స్వామి, ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, కన్వీనర్ మారయ్య, ఈఓపీఆర్డీ బాలన్న, నాయకులు గురుదాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమద్ వ్రతం



హోమంలో పాల్గొన్నఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి హైవే 44 హనుమాన్ జంక్షన్ వద్ద నిర్మితమవుతున్న 51 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద నిర్వాహకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో శనివారం హనుమద్ వ్రతం వైభవంగా నిర్వహించారు. ఉదయం మహాగణపతి పూజతో వ్రతం ప్రారంభమైంది. స్థానిక ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సకల దేవతలకు హోమం, హనుమాన్ దీక్షాధారులచే పంచామృతాలతో అభిషేకం, మహామంగళహారతి, వ్రత కథలు, అన్నమాచార్య సంకీర్తనలు జరిగాయి. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, వెల్దుర్తి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, సొసైటీ బ్రహ్మానందరెడ్డి, రెడ్‌క్రాస్ రఘునాథ్‌రెడ్డి తదితరులు హోమంలో పాల్గొని, పూర్ణాహుతి సమర్పించారు. అభయాంజనేయస్వామి ఉత్సవ మూర్తిని ఆవిష్కరించి, కలశం , స్వామి వారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీ కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, మాజీ ఎంపీపీ దశరథ రామిరెడ్డి, సీఐ సురేశ్ కుమార్ రెడ్డి తదితరులు వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిధులు, పాల్గొన్న పీఠాధిపతులకు నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతించి, సన్మానించారు. సాయంత్రం వెల్దుర్తి పట్టణ పురవీధులగుండా మాలధారులు, భక్తులు, పీఠాధిపతులు, విశ్వహిందూ పరిషత్ ప్రముఖుల ఆధ్వర్యంలో కోలాటములు, గురువయ్యల నృత్యములతో అభయాంజనేయ స్వామి ఉత్సమూర్తి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప ఆలయ కమిటీ సెక్రటరీ చిరంజీవి, దాతలు బొరుగుల బట్టి పెద్దయ్య, అల్లుగుండు సెంట్రింగ్ వెంకటేశ్వర్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

కృష్ణగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రామస్వామి అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని అమకతాడు, కంబాలపాడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులు, క్యాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రదీప్, నవీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి, నాయకులు కృష్టారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాలమిన్నెల్ల తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కొనసాగుతోంది. ఇన్‌చార్జ్‌లు చంద్రమౌళి, గోపాల్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం రామళ్లకోట, సాయంత్రం అల్లుగుండులో యాత్ర కొనసాగింది. ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించిన కార్యక్రమాలలో కేంద్రం అమలు చేస్తున్న పథకాల గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించారు. రామళ్లకోట సర్పంచ్ నిర్మల, ఈఓఆర్డీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 939 కేసుల పరిష్కారం



ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ కోర్టులో కేసులను విచారిస్తున్న జడ్జి గురుఅరవింద్

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జడ్జి గురుఅరవింద్ పలు కేసులను విచారించారు. లోక్ అదాలత్‌లో 939 కేసులు పరిష్కారం అయ్యాయి. 118 కేసుల్లో కక్షిదారులు రాజీ కాగా 590 ఎస్‌టీసీ కేసుల్లో రూ.88,510లు జరిమానా విధించగా, 131 సీసీ కేసుల్లో రూ.3,45,000 జరిమానా విధించి పరిష్కరించారు. అలాగే బీఎస్‌ఎన్‌ఎల్ శాఖకు చెందిన ఒక కేసును పరిష్కరించారు. జడ్జి మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి రాజీ మార్గమే రాజమార్గమన్నారు. లోక్ అదాలత్‌లో బార్ అసోసియేషన్ న్యాయవాదులు రఘురాం, లోక్ అదాలత్ సభ్యులు గోపాలకృష్ణ, ఏపీపీ, న్యాయవాదులు కుమార్, శ్రీకాంత్, యేసేపు, నర్సారెడ్డి, సాలమాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భీమలింగేశ్వరస్వామి కల్యాణం, లక్షదీపోత్సవం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె హైవే-44 పక్కన వెలసిన ఆలయంలో ఆదివారం అన్నపూర్ణ సమేత భీమలింగేశ్వరస్వామి వారి కల్యాణం, నూతన నాగభరణం, కిరీట ధారణ, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు లయ ధర్మకర్త బొమ్మిరెడ్డిపల్లె లక్ష్మిరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం కార్తీక వనభోజనాలు, సాయంత్రం లక్ష దీపోత్సవం చేపట్టనున్నట్లు వెల్లడించారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

13న పార్లపల్లిలో రథోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో కార్తీక పూజలను పురస్కరించుకొని 13వ తేదీన శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి దివ్య మంగళ రథోత్సవం ఉంటుందని నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 12న సాయంత్రం ప్రభోత్సవం, 13న ఉదయం దేవాలయంలో శ్రీ సీతారాముల కల్యాణం, సాయంత్రం 5 గంటలకు స్వామి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు రథోత్సవంలో పాల్గొనాలని నిర్వహకులు, గ్రామ పెద్దలు కోరారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య

ఆలూరు: మండల పరిధిలోని గ్రామాల్లో తాగు నీటిని ఎద్దడి లేకుండా జేఈలు, వాటర్‌మెన్లు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య ఆదేశించారు. హాలహర్వి మండలంలోని బాపురం, చింతకుంట, హొళగుంద గ్రామాల్లోని ఎస్ఎస్ ట్యాంకులలో నీటి మీటర్ గేజ్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. త్వరలో మహిళా స్వయం శక్తి గ్రూపు సహకారంతో ఇంటింటా కుళాయి కనెక్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం ఎల్లెల్సీ కాలువకు నీటిని వదిలేంత వరకు ఎస్ఎస్ ట్యాంకులకు నింపు తామన్నారు. ప్రధానంగా జల్ జీవన్ మిషన్ ద్వారా ఈనెలఖరుకు కొన్ని పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతందని డీఈ మల్లికార్జునయ్య తెలిపారు.

పెరవలిలో ఈనెల 21న వేలం

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో తలనీలాలు ఏడాది పాటు పోగుచేసుకునుటకు ఈనెల 21న గురువారం 11 గంటలకు ఈ టెండర్‌కం. సీల్డ్ కొటేషన్‌కం, బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ దస్తగిరి గౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ వేలంపాటల్లో పాల్గొనేవారు లక్ష రూపాయలు ధరావత్తు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు సంబంధిత కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

యువతలో నైతిక విలువలు పెంపొందాలి



కార్తీక పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు,స్థానికులు

ఎమ్మిగనూరుటౌన్: నేటి యువత దేశ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు నైతిక విలువలను పెంపొందించుకోవాలని నందవరం ఎంఈఓ 2 రఘునాథ్ అన్నారు. శనివారం పట్టణంలో గ్లోబల్ ఇండస్ స్కూల్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఉసిరి చెట్టు పూజతో పాటు సరస్వతిదేవి, భరత మాత చిత్రపటాలతో పూజ కార్యక్రమాలు చేశారు. ఆయన మాట్లాడుతూ దేశసమగ్రత, దేశ నిర్మాణంలో యువత భాగస్వాములయ్యేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య భారతి జిల్లా ఉపాధ్యక్షుడు సరస్వతి శిశుమందిర్ ప్రతినిధి డాక్టర్ జగదీష్, ఆపస్ నాయకులు నాగస్వామినాయక్, ఉసేని, లక్ష్మీనారాయణ, రంగస్వామి, హరికృష్ణ, కేశన్న, గీత, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర నమోదుకు 13 వరకు గడువు

హాలహర్వి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల్లో పాల్గొనేందుకు పేర్లను నమోదు చేసుకునేందుకు ఈనెల 13వ తేదీ వరకు సమయం ఉందని ఎంపీడీఓ ఆంతోని శనివారం తెలిపారు. ఆసక్తి గల 15 ఏళ్ల నిండిన యువతీ యువకులు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. క్రీడల్లో విజయం సాధించిన వారికి ప్రభుత్వం బహుమతులను అందిస్తుందని చెప్పారు. మరిన్ని వివరాలకు దగ్గరలోని సచివాలయాలను సంప్రదించాలన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



బస్టాండులో తక్కువ ఎత్తులో ఉన్న స్ట్రీట్‌లైట్ ఫ్యూజులు

హొళగుంద: స్థానిక బస్టాండులోని కుమ్మరివీధికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్ ఆన్, ఆఫ్‌కు సంబంధించిన మీటరు, మూతలు లేని ఫీజులు ప్రమాదకరంగా ఉన్నాయి. చిన్న పిల్లలకు అందే ఎత్తులో ఉండటంతో ఎవరైనా అదమరిచి చేతులు పెడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. బస్టాండులో ఎప్పుడు రద్దీగా ఉంటుంది. అంతేగాక జనాలు కూర్చునే చోటు పక్కనే ఫీజు ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఫీజులకు మూతలు ఏర్పాటు చేయాలని, బాక్సులను ఎత్తులో బిగించాలని కోరుతున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితులు, మద్యం వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ హరికృష్ణ

ఆదోనిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద శనివారం మోటార్ సైకిల్‌పై అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న పట్టణానికి చెందిన బోయ ఉదయ్‌కుమార్, బోయ నరసింహాను అదుపులోకి తీసుకొని, మద్యం స్వాధీనం చేసుకున్నామని సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. వారి నుంచి కర్ణాటక రాష్ట్రానికి చెందిన 9 మద్యం బాక్సులు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. దాడుల్లో ఎస్‌ఐలు శివప్రసాద్, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.


చదువుతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ వెంకటరమణ

ఆదోనిరూరల్: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఆదోని డిప్యూటీ ఈఓ వెంకటరమణ అన్నారు. శనివారం మండలంలోని ఆరేకల్ గ్రామంలోని బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల/ కళాశాలలో ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. విద్యార్థుల ప్రయోగాలను అడిగి తెలుసుకున్నారు. వాటి వల్ల కలిగే ఉపయోగాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదల, కృషితో చదివి ఉన్నత శిఖరాలను అవరోధించాలన్నారు. అంతకముందు ఎన్‌సీసీ స్టూడెంట్స్ డిప్యూటీ ఈఓకు స్వాగతం పలికారు. అనంతరం డిప్యూటీ ఈఓను ఉపాధ్యాయులు సన్మానించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రణ మండల ఆంజనేయస్వామి

ఆదోనిఅర్బన్: కార్తీకమాసం చివరి శనివారం సందర్భంగా పట్టణ శివారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు టి.జి.పాండురంగశెట్టి ఆధ్వర్యంలో కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి సభ్యులు స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీ, పూలహారం, అలంకారం, నైవేద్యం, మహామంగళహారతి పూజలు చేపట్టారు. పాఠశాలలకు సెలవు కావడంతో పట్టణంలోని భక్తులు కుటుంబ సభ్యులతో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె, బుదుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహా మంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. బుదుముల దొడ్డిలో భక్తులకు అన్నదానం చేశారు.

కోసిగి: స్థానిక కడపాళెం వీధిలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీకమాసం చివరి శనివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. వేకువజాము నుంచి ఆలయ అర్చకులు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వస్త్రాలంకరణ, వెండి కవచ అలంకరణ, ఆకు పూజలు గావించి మహా మంగళ హారుతులు ఇచ్చారు. భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్తీక మాసం ముగింపు సందర్భంగా ఈనెల 13వ తేదీన కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

హక్కుల సాధనకై పోరుబాట

ఎమ్మిగనూరుటౌన్: దివ్యాంగుల హక్కుల సాధనకై నిర్వహించిన పోరుబాట కార్యక్రమం శనివారం పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ నుంచి ప్రారంభమైంది. కార్యక్రమాన్ని మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో జైభీం వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య, జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, దివ్యాంగుల సంఘ నాయకులు నాగరాజు, రామాంజినేయులు తదితరులు మాట్లాడారు.

అదుపుతప్పిన లారీ



అదుపుతప్పి పొలం గట్టుకు ఢీకొన్న లారీ

ఆలూరు రూరల్: లారీ అదుపుతప్పి పొలం గట్టును ఢీకొట్టింది. మండలంలోని కరిడిగుడ్డం గ్రామం సమీపంలో శనివారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది. అనంతపురం నుంచి హొళగుంద సిమెంట్ లోడుతో వెళ్తుండగా లారీ ముందు చక్రాల మధ్య ఉన్న ఇనుప రాడ్డు విరిగిపోవడంతో పొలం గట్టును ఢీకొంది. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ ప్రాణాలతో బయటపడ్డారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం



ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

హొళగుంద: మండల కేంద్రం సమీపంలో వెలసిన అగ్రహార ఆంజనేయస్వామికి శనివారం కార్తీక మాసం పురస్కరించుకుని సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులు దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు అర్చనలు, పంచామృతభిషేకం, ఆకు పూజ, మహామంగళహారతి, నైవేద్య సంతర్పణ ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయంలో పలు ఆకారాల్లో వెలగించిన దీపాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. రాత్రి అన్నదానం, భజన కార్యక్రమాలు జరిగాయి.

అభివృద్ధి, సంక్షేమాన్ని చాటి చెబుదాం



కృష్ణగిరిలో లబ్ధిదారులకు బ్రోచర్లను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రత్నపల్లెలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

కృష్ణగిరి: నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను ప్రతి ఇంటికీ వెళ్లి చాటి చెప్పి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరాలని వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, నారాయణ అన్నారు. శనివారం కృష్ణగిరిలో వారు నాయకులతో కలిసి 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ మేనిఫెస్టో అమలుపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి బ్రోచర్లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హుసేన్‌సాహెబ్, చిన్నన్న, సుంకన్న, బాలమద్ది, వడ్డె సత్యం తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి మండలంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలోని రత్నపల్లె గ్రామంలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సెక్రటరీ దేవమ్మ ఆధ్వర్యంలో సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును రత్నపల్లె భాస్కర్‌రెడ్డి, బోయనపల్లె అశోక్ రెడ్డి, రత్నపల్లె సుధాకర్, వెల్దుర్తి ఆరిఫ్, శివారెడ్డి ఆవిష్కరించారు. నాలుగున్నరేళ్ల కాలంలో తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో పెద్దయ్య, కృష్ణ, తిరుపాల్, రంగస్వామి, బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఆదోనిఅర్బన్: మండలంలోని గణేకల్ గ్రామ సమీపంలో శనివారం కూలీ పనికి వెళ్లి తిరిగొస్తున్న నలుగురిని బైకు ఢీకొనడంతో గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కడితోట గ్రామానికి చెందిన ఉశేనమ్మ, కావేరి, అంజినమ్మ, రమేష్ కూలీ పనులు చేస్తుండేవారు. పని ముగించుకొని స్వగ్రామానికి వెళ్తున్న వారిని గణేకల్ గ్రామ సమీపంలో బైకు ఢీకొట్టింది. దీంతో నలుగురికి గాయాలయ్యాయి.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

ఆదోనిరూరల్: పత్తికి క్వింటాకు రూ.10 వేల ప్రకారం గిట్టుబాటు ధర కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు, ఆదోని అభివృద్ధి వేదిక నాయకుడు ఆదినారాయణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య కోరారు. శనివారం స్థానిక మార్కెట్‌యార్డులో పత్తి రైతుల జిల్లా సదస్సును రైతు సంఘం మండలాధ్యక్షుడు శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు పత్తి పంటకు కనీస మద్దతు ధర రూ.10 వేలు కల్పించాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 6 లక్షల హెక్టార్ల వరకు పత్తి పంటను రైతులు సాగు చేస్తుంటే ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2 లక్షల హెక్టార్లకు పైగా సాగు చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.6 వేల నుంచి రూ.7 వేలకు మించి ధర లభించడం లేదన్నారు. సదస్సులో రైతు సంఘం జిల్లా నాయకుడు ఈరన్న, మండల కార్యదర్శి బి.అయ్యప్ప, నాయకులు చిన్నతిక్కన్న, హనుమంతురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆదోనిరూరల్: ఎనిమిది వారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న కోరారు. శనివారం మండలంలోని కొత్తూరు గ్రామంలో ఉపాధి కూలీలతో సమావేశమై మాట్లాడారు. తీవ్రమైన కరువు పరిస్థితుల వల్ల ఉపాధి హామీ పనులు నవంబర్ ముందు నుంచే ప్రారంభమయ్యాయని, చాలా గ్రామాల్లో చేసిన పనికి నేటికీ వేతనాలు రాక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. సంఘం గ్రామ కమిటీ కార్యదర్శి కర్ణ, మండలాధ్యక్షులు రంగన్న, కూలీలు పాల్గొన్నారు.